# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-08-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
2. **రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.**
3. **రాజధాని అమరావతి గ్రామాల్లో ఒక వెయ్యి 437 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పనకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఆమోదం తెలిపింది.**
4. **పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు.**

==========================

నేపాల్‌లో సంభవించినవరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కర్నూలు, ఆదోని ప్రాంతాలకు చెందిన నలుగురు టిబెట్‌లో, తిరుపతికి చెందిన 28 మంది ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ఏడుగురి ఆచూకీ తెలియడం లేదని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ.. ఆచూకీ తెలియని వారి వివరాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రజలు దేశవ్యాప్తంగా ఈరోజు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ. రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీక అని వారు పేర్కొన్నారు. ఈ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

--------------------------

రాజధాని అమరావతి ప్రాంతంలోని 29 గ్రామాల్లో ఒక వెయ్యి 437 కోట్ల రూపాయలతో మౌలిక

సదుపాయాలు కల్పనకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సీఆర్డీఏ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశ నిర్ణయాలను మంత్రి పి.నారాయణ పాత్రికేయులకు వెల్లడించారు. రెండో దశ భూసమీకరణకు భూములిచ్చిన రైతులకు కూడా రుణ మాఫీ వర్తింపజేయనున్నామని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ల వరకు ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి తీసుకునేందుకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

వచ్చే ఐదేళ్లలో 25 వేల కోట్ల రూపాయలతో క్రీడా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిన్న మాట్లాడుతూ, 2014 తర్వాత క్రీడారంగంలో పలు వ్యవస్థీకృత సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో 14 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. క్రీడా బడ్జెట్‌ను 2 వేల కోట్ల నుంచి 4 వేల కోట్లకు పైగా పెంచినట్లు పేర్కొన్నారు.

---------------------------

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణ వాసుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు అందించిన సమాచారంతో ఇప్పటివరకు 23 మంది తెలంగాణ వాసులను ప్రాథమికంగా గుర్తించి, వారి వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపినట్లు చెప్పారు.వారి ఆచూకీ, భద్రతపై కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో తెలంగాణ ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేస్తోందన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, హైదరాబాద్ సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

భవిష్యత్తు సాంకేతిక అంతా కృత్రిమ మేధస్సు – ఏఐ దేనని జీఎస్టీ అదనపు డైరెక్టర్ జనరల్ ఈ.రవికిరణ్ అన్నారు. "ఏఐ యుగంలో విశ్లేషణాత్మక ఆలోచన ప్రాధాన్యత అనే అంశంపై విశాఖపట్నంలోని ఒక కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐ పనితీరు, భవిష్యత్తు తరాలకు దాని వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు.

---------------------------

పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించనున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, గత 16 నెలల్లో హంద్రీనీవా ప్రాజెక్టుపై 3,500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీటిని అందించినట్లు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంటల బీమాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ.. వాయిస్ 32 సెకన్లు

---------------------------

కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా లింగదహళ్లి గ్రామంలో చేపట్టిన రాగి, బంగారం అన్వేషణ కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం అన్వేషణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో సింగరేణి సంస్థ దేవదుర్గ బ్లాక్ అన్వేషణ హక్కులను దక్కించుకుందని, పనులను త్వరలోనే వేగవంతం చేస్తామని చెప్పారు. బంగారం, రాగి నిక్షేపాలు లభిస్తే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ దోషరహిత జాబితా రూపొందించాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ పవన్ కుమార్ శర్మ సూచించారు. ఆంధ్రప్రదేశ్ లో ఎస్ఐఆర్ పురోగతిపై కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురించే వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్లు విచారణకు హాజరుకాలేని సందర్భాల్లో బూత్ స్థాయి అధికారులు –బీఎల్వోల ద్వారా ఇంటి వద్దే సహాయం అందించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్‌లో వెనుకబడిన జిల్లాలు, నియోజకవర్గాలు సెప్టెంబర్ 5 లోపు పురోగతి సాధించాలని పవన్ కుమార్ శర్మ సూచించారు.

---------------------------

తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న రాయలసీమ ప్రాంతాలపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ తెలంగాణ, పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న మూడు రోజులు పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్ 21 సెకన్లు

మరో వైపు తెలంగాణలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

======================